క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



గన్నవరంరూరల్: గ్రామాల్లో మౌలిక వసతులైన అంతర్గత రహదారులు, డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ అనగాని రవి చెప్పారు. మండలంలోని తెంపల్లిలో మండల పరిషత్ ఆధ్వర్యాన జరుగుతున్న అభివృద్ధి పనులు సర్పంచ్ కొలుసు శిరీషా, ఎంపీడీవో ఇ.సత్యకుమార్‌తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. పంచాయతీ కార్యాలయానికి తూర్పు వైపు ఉన్న రహదారి, డ్రెయినేజీ శాశ్వత ప్రాతిపదికన నిర్మించి ఇబ్బందులు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ దాస్, కార్యదర్శి జేవీ నామేశ్వరరావు పాల్గొన్నారు.

168 మందికి వైద్య పరీక్షలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వెలగపూడి హోమ్స్ వద్ద నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 168 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎముకలు అరుగుదల, కంటి సమస్యలు, బి.పి., సుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. డాక్టర్లు రవితేజ, వంశీకృష్ణ, జ్యోతి, శ్రావణి పాల్గొన్నారు.

70 మందికి దంత వైద్య పరీక్షలు



కంకిపాడు: దంత సంరక్షణ చాలా ముఖ్యమని దంత వైద్య నిపుణులు డాక్టర్ వణుకూరు ప్రవీణ్ అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో గోసాల జె.డి. డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దంత వైద్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ శిల్పా శర్వాణి శెట్టి, డాక్టర్‌సిహెచ్ అనూష, డాక్టర్ హదస్సా వైద్య పరీక్షలు చేశారు. 70 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. డాక్టర్‌ప్రవీణ్ మాట్లాడుతూ దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

దుర్గగుడి బస్సుల్లో ఈవో తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల నుంచి దేవస్థానానికి నడుపుతున్న బస్సుల్లో దుర్గగుడి ఈవో భ్రమరాంబ తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఓం టర్నింగ్ వద్ద బస్సులను తనిఖీ చేసిన ఈవో భ్రమరాంబ భక్తులతో మాట్లాడారు. కండక్టర్ వద్ద మెషిన్ రికార్డు పరిశీలించడంతో పాటు టికెట్ల డబ్బులను లెక్కించారు. రికార్డు మొత్తానికి టికెట్ల డబ్బులు సరిపోవడంతో వారికి పలు సూచనలు చేశారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగడం, వారిని సకాలంలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌లకు చేర్చేలా చూడాలని ఆదేశించారు.

ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు జరిగాయి. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పూజల్లో పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి పంపారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్
- ఉత్సాహంగా పెనమలూరు ఏఎంసీ ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పక్కన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కంకిపాడు: రాబోయే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వ స్థాపనకు కంకణ బద్ధులై పనిచేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెనమలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం కంకిపాడు బస్టాండు సెంటరులో ఆదివారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. తాడిగడప లోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ బందరు రోడ్డు మీదుగా బస్టాండు సెంటరు వరకూ సాగింది. ఈ సందర్భంగా లాకురోడ్డు కూడలిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఏఎంసీ చైర్మన్‌గా సేనావత్తు చిన్ని, వైస్ చైర్మన్‌గా మాదు వసంతరావు, పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశం గర్వించదగ్గ పరిపాలన రాష్ట్రంలో సీఎం జగన్ అందిస్తున్నారని చెప్పారు. అన్ని రాష్ట్రాలూ, ప్రపంచ దేశాలూ రాష్ట్రం వైపు చూస్తున్నాయని తెలిపారు. సంస్కరణలు, పరిపాలనా విధానాల అమలుకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. పారదర్శక పాలన, ప్రజల సంక్షేమం దిశగా అందిస్తుంటే ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. 40 ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు కుట్రలు చేస్తూ, ప్రజల్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేలా టీడీపీ, ఇతర ప్రతిపక్షాల వ్యవహారం నడుస్తోందని దుయ్యబట్టారు.

వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమం....

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని, ప్రజలకు దక్కని సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అందుతుందన్నారు. ప్రజలు ఆనందంగా ఉండటాన్ని ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయటమే లక్ష్యంగా ఎల్లో మీడియాతో కుమ్మక్కై దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని స్పష్టం చేశారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ ప్రజల కష్టం తెలుసుకుని వారికి అండగా నిలిచే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొప్పన భవకుమార్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈడే చాముండేశ్వరి, రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, నక్కా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పాలకవర్గ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి కృషి



అగ్నికుల క్షత్రియుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా విజయవాడలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి మండలంలోని మద్దూరు గ్రామం నుంచి ఆదివారం బయలుదేరిన అగ్నికుల క్షత్రియుల ర్యాలీని ఎమ్మెల్యే పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా అగ్నికుల క్షత్రియుల ఉన్నతికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. తొలుత ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే పార్థసారథిని సంఘ ప్రతినిధులు ప్రత్యేకంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు, సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, జిల్లా బీసీ అధ్యక్షుడు వల్లభనేని మణికంఠ, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆప్యాయత, అనురాగాలతో స్నేహితుల దినోత్సవం



శిరీషా దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు

ఉయ్యూరు: స్నేహితుల దినోత్సవాన్ని ఆప్యాయత, అనురాగాలతో సంతోషంగా జరుపుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శిరీషా దివ్యాంగుల కేంద్రంలో ఆదివారం కేక్ కట్ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, 1989–90 ఉయ్యూరు జెడ్పీ పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు దివ్యాంగులతో కలిసి ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. కేక్ కట్ చేయించి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, కోశాధికారి ఊర కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఏజీఅండ్ ఎస్‌జి సిద్దార్థ కళాశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఫ్రెండ్‌షిప్‌డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు, యువత, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుని సంతోషంగా గడిపారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ప్రత్యేక వాహనంలో వెళుతున్న ఏఎంసీ డైరెక్టర్లు

పెనమలూరు: మండల కేంద్రంలోని ఆదివారం వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఏఎంసీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేశారు. పెనమలూరు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి, ఏఎంసీ చైర్‌పర్సన్ నానావత్ చిన్ని, ఏఎంసీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కానూరు నుంచి బందరు రోడ్డు మీదగా కంకిపాడు వరకు ర్యాలీగా వెళ్లారు. ఏఎంసీ చైర్‌పర్సన్ నానావత్ చిన్ని, డైరెక్టర్లు ప్రత్యేక వాహనంపై ఉండగా, పార్టీ శ్రేణులు బైక్ పై ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్, డైరెక్టర్లకు గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. కార్యకర్తలు పూలతో, పార్టీ జెండాలతో స్వాగతం పలికారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా యనమలకుదురుకు చెందిన ఎస్టీ మహిళ నానావత్ చిన్నిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వటంతో ఆమెకు మద్దతుగా పార్టీ శ్రేణులు నిలిచారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పెనమలూరు నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, చాంద్‌బాషా, సిద్దిఖ్, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, అంగిరేకుల సీతారామయ్య, వీరబాబు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కొడాలి శ్రీధర్, తెన్నేటి ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి..

కాగా ఏఎంసీ డైరెక్టర్లుగా నియమించిన చోడవరానికి చెందిన మండూరు కోటేశ్వరరావు, పెనమలూరుకు చెందిన కొడాలి సుష్మా కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతిని కలిసి పెనమలూరులో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.

యనమలకుదురులో గద్దర్‌కు నివాళి



యనమలకుదురులో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

పెనమలూరు: ప్రజాగాయకుగు గద్దర్ అకాల మరణం చెందటంతో జిల్లా ప్రజానాట్య మండలి కళాకారులు ఆదివారం ఘన నివాళులర్పించారు. యనమలకుదురు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజానాట్య మండలి అధ్యక్షుడు షేక్.కాశిం ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాశిం మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం గద్దర్ ఎనలేని పోరాటం చేశారన్నారు. పోలీసులు ఆయన పై కాల్పులు జరిపినా ఎదురు నిలిచి పోరాటం చేశారన్నారు. ఆయన ఆటపాటలతో పేదలు, పీడిత వర్గాల ప్రజలకు చైతన్య పరిచారని పేర్కొన్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పెనమలూరు: గంగూరు సెంటర్ వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. తాడిగడప బాలాజీనగర్‌కు చెందిన పాల్‌సుధాకర్ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. ఆయన తన బైక్ పై శనివారం తాడిడప నుంచి గోసాలకు వెళుతుండగా గంగూరు సెంటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటలో పాల్‌సుధాకర్‌తో పాటు మరో బైక్ నడుపుతున్న బత్రాజు పాండు రంగారావుకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో విజయవాడ ప్ర భుత్వాస్పత్రికి తరలించారు. పాల్‌సుధాకర్ ఫిర్యా దు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. తాడిగడప వసంతనగర్ కట్టకు చెందిన మాదాసి అరుణ 2019 లో పెద్దల సమక్షంలో మాదాసి ఉదయ్‌తేజను ప్రేమ వివాహం చేసుకుంది. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. వీరికి పిల్లలు లేరు. కాగా భర్త గత కొద్ది నెలలుగా భార్యను సక్రమంగా చూడటంలేదు. కట్న కానుకలు కావాలని లేని పక్షంలో విడాకులు ఇవ్వాలని బెదిరించాడు. పెద్దల సమక్షంలో చర్చలు జరిపినా భర్త ప్రవర్తనలో మార్పురాకపోవటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

11న విశేష పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అధిక శ్రావణ మాసం, బహుళ దశమిని పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన అమ్మవార్లకు సహస్ర పద్మములతో అర్చన, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మంగళగిరికి చెందిన నటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

కూలీలకు అండగా ఉపాధి హామీ పథకం



కొండపావులూరులో చెరువు తవ్వకం పనులు పరిశీలిస్తున్న ఏపీవో సత్యప్రియ (ఫైల్)



వీరపనేనిగూడెంలో డ్వామా ఆధ్వర్యంలో ఏర్పాటైన నర్సరీ

గన్నవరంరూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు అండగా నిలిచింది. మండలంలోని 21 గ్రామాల్లో మొత్తం 13,226 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. వీరిలో ఈ సంవత్సరం అత్యధికంగా కూలీలు పనులకు హాజరయ్యారు. 5,036 మంది పనులకు హాజరు కాగా ఉపాధి పథకం ద్వారా 2 లక్షల 61 వేల 699 పని దినాలు ఇప్పటి వరకూ చేశారు. ఈ ఏడాది వేసవి కాలంలో కూలీలకు రూ.6.52 కోట్లు వేతనాలుగా చెల్లించారు. ఖరీఫ్ సీజన్ రావటంతో ముందస్తుగా పథకం అధికారులు ఎక్కువగా పంట కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. వాటితో పాటు చెరువుల్లో పూడికలు తీయించి వర్షాకాలంలో నీటి నిల్వకు అనుకూలంగా చెరువులను బాగుజేశారు. ఉద్యాన వన పంటల సాగుకు, రహదారుల వెంట మొక్కల పెంపకానికి, డ్వామా ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి అధికారుల పర్యవేక్షణలో కూలీలు పనులు నిర్వహించారు.

మొక్కల సరఫరాకు చర్యలు

కొండపావులూరు చెన్నప్ప చెరువు, పెద్ద చెరువు, దుబ్బుళ్లకుంట, సూరంపల్లి చిన్న చెరువు, బుడక చెరువు, ఉప్పలపాటికుంట, తెంపల్లి మల్లయ్యకుంట, కోమటికుంట, వీరపనేనిగూడెం గుజ్జనగుంట, గొల్లనపల్లి కుంపటి చెరువు, కొత్తగూడెం కలివెల కుంట చెరువుల్లో పూడికతీతలు జరిగాయి. అమృత్ సరోవర్‌లో భాగంగా మండలంలోని బుద్ధవరం ఊర చెరువు, గోపవరపుగూడెం మంచినీటి చెరువు, సూరంపల్లి బుడక చెరువు, వెంకటాయకుంట, వీరపనేనిగూడెం ఊరచెరువు, గన్నవరం పానకాలు చెరువు అభివృద్ధికి నోచుకున్నాయి. డ్వామా ఆధ్వర్యంలో వీరపనేనిగూడెంలో నర్సరీ ఏర్పాటు చేసి ఆరు మండలాలకు మొక్కల సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ములగ, వేప, నీడనిచ్చే చెట్లు, ఫలాలనిచ్చే మొక్కలు ఇక్కడ పెంచి పలు గ్రామాలకు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఉపాధి పనులు ఆదుకున్నాయి



ఉపాధి అధికారుల పర్యవేక్షణలో పంట కాలువలు పూడికతీత, చెరువుల తవ్వకం పనులు చేశాం. వేసవిలో ఉపాధి పనులు ఎంతగానో ఆదుకున్నాయి. పథకం ద్వారా మేలు జరిగింది.

–బాయన నాగేశ్వరమ్మ, ఉపాధి కూలీ, సావరగూడెం

పనుల కల్పన బాగుంది



వేసవిలో ఉపాధి పనులు గ్రామస్తులకు అండగా నిలిచాయి. పథకం ద్వారా పనుల కల్పన ఎంతో బాగుంది. ఉపాధి పనులతో లబ్ధి పొందాం. ఆర్థిక అవసరాలకు పనులు తోడ్పాటు అందించాయి.

–చెట్టుపల్లి శేషమ్మ, ఉపాధి కూలీ, సావరగూడెం

మణిపూర్ ఘటనలపై నిరసన ర్యాలీ



పెనమలూరులో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాలు

పెనమలూరు: మణిపూర్‌లో విధ్వంసకాండను నిరసిస్తూ పెనమలూరులో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ అన్ని సంఘాల దైవ సేవకులు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ పెనమలూరు నుంచి తాడిగడప వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ క్రైస్తవుల హక్కులు కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండను ఆపాలని కోరారు. అమాయక ప్రజలకు అతి కిరాతకంగా చంపటం దారుణమని తెలిపారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులు ఆపాలని లేని పక్షంలో భారతదేశంలో శాంతికి భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించి మణిపూర్ ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఫెలోషిప్ ప్రతినిధులు జాన్‌క్రాస్, ఆనందరావు, ప్రభుకుమార్, సీవై.పీటర్, సమూయేలు, దానియేలు, సిస్టర్ తబిత, సుచిత్ర కేథరస్, సీహెచ్.యోబు, దైవసేవకులు పాల్గొన్నారు.

19న వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు

గన్నవరం: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పదవుల భర్తీకి ఈ నెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను ఆదివారం అధికారులు విడుదల చేశారు. మండలంలో చిన్నఆవుటపల్లిలో 6వ వార్డు, కొండపావులూరులో 6వ వార్డు, ముస్తాబాదలో 1వ వార్డుకు ఎన్నికలు జరుగుతాయన్నారు. దీనికోసం ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ విత్‌డ్రా చేసుకోవచ్చాని పేర్కొన్నారు. ఈ నెల 14న పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అదే రోజు రెండు గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఎన్నికైన అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల పోలింగ్ రద్దు అయితే తిరిగి ఈ నెల 20వ తేదీ నిర్వహిస్తామన్నారు.

రేపు గ్రామ వార్డు సభ్యుల ఎన్నిక నోటిఫికేషన్

ఉంగుటూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ అనుసరించి గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ ఈ నెల 8 నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో తుట్టగుంట 5వ వార్డు, ఎన్ఏ పేట 4వ వార్డు, గారపాడు 8వ వార్డు, తేలప్రోలు 4వ వార్డు సభ్యుల ఎన్నిక నోటిఫికేషన్ 8వ తేదీన విడుదల చేస్తారని చెప్పారు. 9 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాలు, 13న అభ్యంతరాలపై వచ్చిన అప్పీలు పరిష్కరించడం, 14న తుది అభ్యర్థుల ప్రకటన, 19వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని ఎంపీడీవో చెప్పారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి అర్జీల ద్వారా తెలియజేస్తే, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కోసం ప్రదర్శన జరిగింది. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు నీతి కథలు, చందమామ కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ప్రదర్శించి, వారితో చదివించారు. అనంతరం సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఉచితంగా నాట్యంలో శిక్షణ ఇచ్చారు. చిన్నారులు నృత్య రీతులను, సంగీత సాధన చేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు భాగవతుల వెంకట సీతారామ శర్మ, గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి, కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణకిషోర్ సామాజిక సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: జనవిజ్ఞానవేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ చేసిన సామాజిక సేవలు వెలకట్టలేనివని పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, సమతా సేవా సమితి, సంగమం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ సంస్మరణ సభను బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాల నిర్మూలకు నిరంతర కృషి చేసినట్లు తెలిపారు. 1988 నుంచి జన విజ్ఞాన వేదికలో కీలకంగా పని చేసినట్లు తెలిపారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ పూర్వ అధ్యక్షుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ కళల ద్వారా సామాజిక మార్పును ఆశించిన కార్యకర్త ఆయన అని అభివర్ణించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవం విజయవంతం అవడానికి ఆయన కృషి చేసినట్లు తెలిపారు. కృష్ణకిషోర్ కుమార్తె అరుణ మాట్లాడుతూ ఆయన నిరంతరం సమాజం కోసమే కృషి చేశారన్నారు. వివిధ రంగాలకు చెందిన సత్యశ్రీనివాస్, అన్నే భాస్కరరావు, చింతా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.